"పరుగులు తీస్తున్న
మృత్యుదేవత
ఆమెని మరచిపోయింది."

# వీలునామా

ఇంకా కను చీకటి ఉండగానే అవ్వ లేచింది. నీళ్ల చెంబుని రెండు చేతులా పట్టుకొని రెండు అడుగులు వేసింది. ఆ బరువుకి, ఆపుకోలేక ముందుకి తూలి పడబోయి, చేతిలోని చెంబు వదలి నేలకి చెయ్యి ఆన్చి నిలవరించుకొంది. పెద్దగా శబ్దం చేస్తూ చెంబు నేలమీద పడి సగానికి పైగా నీళ్లు ఒలికిపోయాయి. మిగిలిన నీళ్లతో ఉన్న చెంబును కుడిచేత్తో అలాగే నేలమీద ఈడుస్తూ, ఎడమ చెయ్యి నేలకి ఆన్చుతూ ముందుకు అడుగు కదిపింది ముసలవ్వ.

చెంబుపడ్డ శబ్దానికి నిద్రలోంచి ఉలిక్కిపడి లేచిన ఇంటావిడ నిద్రాభంగానికి విసుక్కొంటూ "అవ్వా! అప్పుడే లేచి కూర్చున్నావా! చలి గడ గడ లాడిస్తున్నది కదా! మరి కాస్తసేపు పడుకొంటే ఏం మునిగిపోతుంది? ఇంత చీకటిలోనే లేచి నువ్వు ఆ గుమ్మం కడక్కపోతే ఉండిపోతుందా" అంది.

అవ్వకి ఆ మాటలేమీ వినపడలేదు. తెల్లవారకుండా గుమ్మాన నీళ్లుజల్లి ముగ్గు పెట్టడం ఆమెకి జ్ఞానం తెలిసిననాటి నుండి చేస్తున్న పని. మిగిలిన జీవితంలోని విషయాలు, అలవాట్లు చాలా మరచిపోయినా ఇటువంటి ఒకటి, రెండు విషయాలు మాత్రం ఆమెకి మరుపున పడలేదు. ఎప్పుడో బారెడు ఎండ ఎక్కాక పనిమనిషి వచ్చి కడుగుతుందని ఆమె చూస్తూ ఊరుకోలేదు.

రెండు చేతులు, రెండు కాళ్లతో అలా ప్రాకుకొంటూ గుమ్మం దగ్గరికి వెళ్తుంటే ఆమెకి లీలగా ఏవో జ్ఞాపకాలు మనసులో కదిలాయి. అదివరలో ఎవరో.... ఎప్పుడో ఇలాగే నడుస్తుంటే తను చూసి నవ్వినట్లు గుర్తుకి వచ్చింది. కాని ఎవరు ఇలా నడవగా చూసింది? తనకెంతో ఆత్మీయమైన వ్యక్తే. మరి ఎలా మరచిపోయింది? ఆ వ్యక్తి ఎవరో ముసలవ్వకి ఒకంతటగాని జ్ఞాపకం రాలేదు. తన మెదడులో మిగిలిన శక్తినంతా వినియోగించి ఆ విషయాన్ని గుర్తుచేసుకోవాలని ఎంతగానో ప్రయత్నించింది.

ఎందుకు గుర్తురాకుండా ఉంది? తనెలా మరచిపోయింది? అవ్వ ఆలోచిస్తూనే వుంది. అలవాటుపడిన చేతులు పని చేసుకుపోతున్నాయి. ఒక చేత్తో నీళ్ల చెంబు ఎత్తి గుమ్మం ముందు నీళ్లు జల్లాలని ప్రయత్నించింది అవ్వ. పుల్లల్లాంటి ఆ చేతులు చలికి వణికిపోతున్నాయి. చల్లని నీళ్లు తగిలి వేళ్లు కొంకర్లుపోతున్నాయి. చెంబులో నీళ్లన్నీ దిమ్మరించినట్లు ఒకచోటే పడిపోయాయి.

ఆ బురదలో చతికిలబడి ముగ్గులు పెట్టింది అవ్వ. కంటి చూపు సరిగా ఆనక, చెయ్యి నిదానంలేక చిన్న పిల్లలు ఆడుకొనే వెన్నెల పోగుల్లా వున్నాయి ఆ ముగ్గులు. ఒకానొక కాలంలో ముచ్చటైన ముత్యాల ముగ్గులు తీర్చిదిద్దిన చెయ్యి అది అని. ఆ ముగ్గులు చూసినవారు ఎవరైనా ఇట్టే పోల్చుకోవచ్చు.

ముగ్గుల పని పూర్తిచేసి చెంబుని ఒకచేత్తో ఈడుస్తూ, ముసలవ్వ ఇంటిలోకి తిరుగు ప్రయాణం మొదలుపెట్టింది. గుర్తురాని వ్యక్తి కోసం ఆమె మెదడు ఇంకా గాలిస్తూనే వుంది.

అంతలో ఆమె కళ్ల ముందు ఏదో రూపం తళుక్కున మెరిసింది. ఆ వెలుగులో ఆ వ్యక్తి తన మనుమరాలి కొడుకు కృష్ణుడు అని అవ్వ పోల్చుకొంది.

"ఓరి.... వెధవకానా... నువ్వట్రా కిష్టిగా? గంటసేపు ఎవరా అని గింజుకొంటున్నాను. దొంగలా మనసులోకి రాకుండా దాక్కొన్నావురా. నీ చిన్నప్పుడు నువ్వు గజ్జెలు, మువ్వలు గల్లు గల్లు మంటూ పాకేవాడివి, ఇప్పుడు నేనూ నీలాగే చూసేవా.... అందుకే అంటారు పసివాళ్లు పెద్దవాళ్లు ఒకటవి..." అవ్వ ముసి ముసిగా నవ్వుకొంది.

మునిమనుమడి జ్ఞాపకాలు అవ్వకి ఎంతో ఆప్యాయమైనవి. వాటిని మరచి పోతుందేమో అనే భయంతో మళ్లా మళ్లా జ్ఞాపకం చేసుకొంటుంటుంది. అడిగినా అడక్కపోయినా అందరితో చెప్తుంటుంది. అయినా ఇటీవల మరుపు ఆమె మనసుని లొంగదీసుకొంటున్నది. ఆరోజు చేసిన పనిని, అప్పుడే అన్న మాటని కూడా ఆమె తరుచు మరచిపోతున్నది.

అవ్వకి ఒకానొకప్పుడు అంతా వుండేవారు. తల్లీ, తండ్రీ, అత్తా, మామా, మరదీ, ఆడుబిడ్డా – అంతా కాలం పిలుపు అందుకొంటూ ఒక్కొక్కరే తరలిపోయారు. ఆ వరుస లోంచి ఎలాగో అవ్వ పక్కకి తప్పిపోయింది. పరుగులు తీస్తున్న మృత్యుదేవత ఆమెని మరచిపోయింది.

ఆమె కట్టుకొన్న భర్త మరణం చూసింది. కన్నబిడ్డల చావులు చూసింది. తను మాత్రం అన్నీ చూస్తూ ఉండిపోయింది. నలుగురు పిల్లల తండ్రి, ఆమె కొడుకు, భార్యా బిడ్డలతో గోదావరి దాటుతూ బోటు తలక్రిందులై జాడ తెలియకుండా అంతా నదిలో కొట్టుకుపోయారు. తొలి కానుపుతోటే తన బ్రతుకును పూర్తి చేసుకొని కన్ను మూసింది కూతురు. అయినా అవ్వకి చావు రాలేదు.

ఆ తల్లిలేని బిడ్డ – అవ్వ మనుమరాలు ఎక్కడో నాయనమ్మ దగ్గర పెరిగి పెద్దదై ఓ యింటి కోడలయింది. పాతికేళ్లకి పూర్వం అవ్వ చావు బ్రతుకుల మధ్య ఉండగా కబురు తెలిసి చూసిపోవాలని వచ్చింది. మనుమరాలి కొడుకులో తన కొడుకు రూపు చూసింది అవ్వ.

"అమ్మడూ, వీడిని నా దగ్గర వదలిపెట్టవే. ముసలిముండను. ఒక్కదాన్నే ఉండలేక చస్తున్నాను. కష్టపడి పదేళ్లు పెంచానంటే కాలికి చేతికి అవుతావు" అంది అవ్వ ఆశగా.

కథా నిలయం
6422
శ్రీకాకుళం

ఈ ముసల్ది ఈ రోగం గడచి బ్రతికి చచ్చిందా, యెందుకు కాదని వాదన వేసుకోవడం అనుకొని, "అలాగే" అంది మనుమరావు.

అవ్వ నిజంగానే చచ్చి బ్రతికింది. "మాటిచ్చావు. కాదంటే ఒప్పుకొనేది లేదు" అంటూ మనుమరాలితో వాదన పెట్టుకొంది.

"నీకే తిన తిండిలేదు. వీడి నెలా పెంచుతావు?" అంది మనుమరాలు.

"కావాలంటే నాలుగిళ్లు ముష్టెత్తి పెంచుతానే - అదంతా నీ కెందుకు?" అంది మొండిగా.

నిజానికి అవ్వ ముష్టెత్తవలసిన అవసరం లేదు. ఆమెకి ఆ పల్లెటూర్లో ఒక పూరిల్లు వుంది. రెండు మడిచెక్క ఇల్లులున్నాయి. నోటిలో మంచితనం వుంది. మెత్తని మనసుంది.

ఆ పదినెలల పిల్లాణ్ణి పదేళ్లవాడుగా చేసేవరకు అవ్వ జిర్రున చీదలేదు. మనుమడు ఆరోక్లాసులో ఉండగా అవ్వకి జబ్బుచేసింది. "అయ్యో. నాయనా కిష్టయ్యా, నిన్ను పెద్దవాణ్ణి చెయ్యకుండానే వెళ్లిపోతానేమోరా" అంటూ మనుమణ్ణి పట్టుకొని ఏడ్చింది.

"ఏడవకే అవ్వా! నిన్ను వెళ్లిపోనీయను... నేను గట్టిగా పట్టుకొంటాను" అంటూ అవ్వకి ధైర్యం చెప్పాడు మనుమడు.

మనుమడి మాట ప్రకారం ఆ సారి కూడా అవ్వ తరలిపోలేదు. అతడి పురోభివృద్ధికి పథకాలు వేస్తూ మళ్లా లేచి తిరుగాడింది.

కృష్ణుడు మెట్రిక్యులేషన్ పాసయేసరికి కరువు దేశంలో కాలు పెట్టింది. మనుమడి కాలేజీ చదువుకోసం ఇల్లూ, భూమి అమ్ముకొని పట్నంలో కాలుపెట్టింది అవ్వ.

కృష్ణుడి కాలేజీ చదువు పూర్తికాకుండానే చైనావాళ్లు మంచు కొండల్లో అలజడి ప్రారంభించారు. వయసు, ఉడుకు రక్తం ఉన్న కుర్రాళ్లు ఎందరో సైన్యంలో చేరారు. తోటి పిల్లలతో ఏదో సినిమా చూసివస్తానని బయలుదేరిన కృష్ణుడు ఇంటికి తిరిగిరానేలేదు.

పది రోజులపాటు రాత్రీ పగలూ ఒకటిగా ఎదురు చూసిన అవ్వ పదోనాడు మనుమడు వ్రాసిన ఉత్తరం చదివించుకుని భోరున ఏడ్చింది.

"అయ్యో నాయనా! నీకీ బుద్ధి ఎందుకు పుట్టిందిరా? నీకేం తక్కువ చేసానురా!" అని కుమిలి కుమిలి ఏడ్చింది.

ఏడాదినాడు మనుమడు యూనిఫారమ్‌లో వచ్చి కళ్ళబడే సరికి ప్రపంచాధిపత్యమే పొందినట్లు పొంగిపోయింది.

"ఎప్పుడో ఓరోజు నువ్వింత గొప్పవాడివి అవుతావని నాకు తెలుసురా కిష్టయ్యా" అంటూ మనుమణ్ణి చూసుకొని మురిసిపోయింది.

అవ్వకి మిగిలిన జీవితమంతా ఏదైనా ఉంటే అది మనుమడే. ఆమెకి సంతోషం కలిగించే విషయాలు అతడి జ్ఞాపకాలే. అటువంటి మనుమడి గురించికూడా అవ్వ ఆ రోజు మరచిపోయిందంటే ఆ తప్పు ఆమెది కాదు వయసు తెస్తున్న ముప్పు అది.

అవ్వ ఆలోచనల మధ్య ఊగుతూండగానే భళ్ళున తెల్లవారింది. వరండా చివరకి ఎండ జరజర ప్రాకుతూ వచ్చింది. ఎండకి ఎదురుగా గోడకి ఆనుకొని, ముడచుకు కూర్చున్నది అవ్వ. ఎండ ఏమంత తీక్షణంగా లేదు. మబ్బుల చాటునుంచి మెల్లగా పొంచి చూస్తున్నది. నీళ్ళకి తడిసిన అవ్వ చేతులు చలికి బిగుసుకుపోతున్నాయి. వేడికోసం వాటిని దుప్పటి క్రిందినుంచి బయటికి తీసింది. వేడికి బదులుగా చలిగాలి వాటిని అదరగొట్టింది. “అబ్బా.... అబ్బా... నాయనా... ఏం చలి... ఏం చలి” అంటూ చేతుల్ని దుప్పటిలోకి లాక్కొంది అవ్వ.

అరగంట గడిచినా ఇంకా మబ్బు విడవలేదు. అవ్వ నరాల్ని కొరుకుతున్న చలి వదలలేదు. ఆశగా ఆకాశం వంక తలెత్తి చూసింది అవ్వ. మబ్బుల చాటున సూర్యుడు ఎర్రగా ముఖం కందపెట్టుకొని కూర్చున్నాడు. ఏ పనికైనా తను కాదంటే అలిగి కూర్చునే మనుమడి ముఖం అవ్వకి గుర్తుకొచ్చింది.

“పిచ్చిసన్నాసులు. అంతా ఒకటే రకం” మెల్లగా నవ్వుకొంది.

అవ్వకి ఆకాశం మీద సూర్యుడు, ఎక్కడో ఉన్న మనుమడు ఒక్కలాంటివారే. ఇద్దరూ ఆమె కళ్ళకి కాంతిని. ఒంటికి వెచ్చదనాన్ని ఇచ్చేవారే. అంతలో ముఖం ఎర్రగా చేసుకొనే వాళ్ళిద్దరూ ఆమె దృష్టిలో పసివాళ్ళే.

పదిగంటలవేళ మబ్బు విడిచింది. ఇంటివాళ్ళ అమ్మాయి అవ్వకి భోజనం తెచ్చింది. “అవ్వా! స్నానం చేశావా?” అంది.

ఆరోజు తను స్నానం చేసిందో లేదో అవ్వకి గుర్తులేదు. చేసే వుంటానని మనసుకి సమాధానం చెప్పుకొంది. చెయ్యకపోయినా వెచ్చగా కప్పుకున్న ఆ దుప్పటి విడిచి అప్పుడు స్నానం చెయ్యాలనే కోరిక ఆమెకి లేదు. ఎదురుగా కంచంలో మాగాయి పచ్చడి అవ్వకి నోరూరించింది.

“ఆ.... ఆ... పొద్దున్నే చేశాసేనే అమ్మడూ” అంది.

మెల్లిగా దేకురుకొంటూ వచ్చి కంచం ముందు కూర్చుంది “పాపం ఈ ఇంటివాళ్ళు, ఎంతో మంచివాళ్లు ఇల్లిచ్చిందేకాక రెండుపూటలా తిండికూడా పెడ్తున్నారు. మా కిష్టయ్య వచ్చేవరకూ ఎలాగోలాగ వీరి పంచన గడిచిపోతే అంతే చాలు.”

మాగాయి పచ్చడి నాలుక్కి రాసుకొంటూ అనుకొంది అవ్వ.

అవ్వ ఆ కొట్టులో ఉండేందుకు, ఆమె తిండికి, నెల నెలా కృష్ణుడు ఆ ఇంటివారికి డబ్బు పంపుతుంటాడు. వారి మధ్య ఏదో దూరపు చుట్టరికం కూడా ఉంది. కాని ఈ విషయాలేవీ అవ్వకి తెలియవు. కావాలనే ఆమెతో కృష్ణుడు చెప్పలేదు.

దయాధర్మంగా వారు తనని ఆదుకొంటున్నారంటే అవ్వకి వారిపట్ల కలిగే మంచి భావం. డబ్బు పుచ్చుకు చేస్తున్నారంటే తరిగిపోవచ్చు. ‘ఊరకే పెడ్తున్నారా?’ అంటూ వారితో వాదన పెంచుకోవచ్చు. ఈ వయసులో ఆపాటి అభిమానంతో ఆమెను చూసేవారు కూడా లేకుండా పోతారనుకున్నాడు కృష్ణుడు.

ఎండకి, నీడకి మధ్యగా పడుకొని ఒక కునుకు తీసి లేచింది అవ్వ. అప్పటికి వంటిన పట్టిన చలి వదలింది. ఉదయం తిన్న భోజనం కూడా అరిగిపోయింది. ఏదైనా నోట్లో వేసుకోడానికి ఉంటే బాగుండును అనిపించింది అవ్వకి. పనిమనిషి కొడుకు తల్లి కొనిపెట్టిన మరమరాల్ని కాగితపొట్లంలోంచి తీసుకు తింటున్నాడు. ఇంటివారి పిల్లడు పీచుమిఠాయి కొనుక్కొని చెల్లెలితో వంతులు వేస్తున్నాడు.

"నాక్కాస్త పెడ్తావురా, రంగయ్యా!" పెదవులు చప్పరిస్తూ అంది అవ్వ.

"అబ్బా.... మరి నాకో" అన్నాడు రంగడు. పీచుమిఠాయి ఉన్న చేతిని వెనక్కి దాచుకొంటూ.

"నేను పెట్టనా అవ్వా?" అంది చిట్టి.

అది అప్పటికే దానిని ఒకపక్క నుంచి తినడం మొదలుపెట్టింది. ఆ పక్కంతా నోటిలోని ఉమ్మి తగిలి బంకలా తయారయింది. అయినా అవ్వ మనసు పట్టలేకపోయింది. ఎంగిలైతే మాత్రం ముంచుకుపోయేదేమిటి? పసివాళ్లు దేవుడిలాటి వాళ్లు అంటారు. అనుకొంది అవ్వ. ఆశగా చెయ్యి ముందుకి జాచింది.

"అబ్బా. ఎంతాశ" చెయ్యి వెనక్కి పెట్టుకొని పరుగు తీసింది చిట్టి.

అవ్వ ముఖంలో ఆశాభంగం కొట్ట వచ్చినట్లు కన్పించింది. లోతుకుపోయిన కళ్లలో నీళ్లు లీలగా తిరిగాయి.

డబ్బుకోసం గుమ్మం దగ్గర నిలబడి ఉన్న పీచు మిఠాయివాడికి ఇంటి దగ్గర ఉన్న తల్లి గుర్తుకొచ్చింది. ఇంత ముద్దతీసి అవ్వ చేతిలో పెట్టాడు. "మా నాయనే... మా నాయనే..." అంటూ సంతోషంగా దానిని అందుకొంది అవ్వ.

అవ్వ తన బోసినోటితో తియ్య తియ్యని పీచుమిఠాయిని లొట్టలు వేస్తూ తింటుంటే "అవ్వా! నేను గుర్తున్నానా?" అంటూ కనకం వచ్చింది.

"ఎవరు పిల్లా! ఎప్పుడో చూసానే నిన్ను" అంది అవ్వ జ్ఞాపకం చేసుకుంటూ.

"ఎప్పుడో చూడ్డమేమిటి అవ్వా. నేను కనకాన్ని. మీ కిష్టిగాడూ నేను ఆడుకొనేవారిమి. నువ్వు మా ఇద్దరికీ కొబ్బరిపాకం. అటుకులు పెట్టేదానివి. గుర్తులేదా? నాలుగేళ్ల కిందటిదాకా నేను మీ ఇంటి పక్కనే ఉండేదాన్ని కదా. అప్పుడే మరచిపోయావా" అంది నకం తనెవరో గుర్తుచేస్తూ.

"అయ్యో... నా తల్లీ! నువ్వంటే కనకం. ముసలిదాన్ని అయిపోయాను చూడు. ఏ విషయం బొత్తిగా జ్ఞాపకం ఉండటం లేదు."

"నువ్వు మరచిపోయినా నేను మరచిపోనులే. చేతికి గోరింట పెట్టుకొన్నప్పుడల్లా నువ్వు జ్ఞాపకం వస్తావు. అట్ల తదియ వచ్చిందంటే ఎంతో ఓపిగ్గా ఆకంతా మెత్తగా నూరి ఎంతో అందంగా చేతికి గోరింట పెట్టేదానివి..."

"అవునే కనకం. ఇప్పుడు గుర్తుకొస్తున్నాది. ఒకసారి నీతోపాటు కిష్టిగాడికి కూడా గోరింట పెడితే, 'ఆడబ్బాయి' అని నువ్వు ఉడికించావు. అప్పుడు వాడేదో చేశాడు కదూ..."

"ఏదో చెయ్యడమేమిటి? అట్ల తదియనాటి రాత్రి నా వువ్వుల జడంతా కత్తిరించి పోగులు పెడితే..." ఆ జ్ఞాపకాలని హరాయించుకో లేకపోయింది కనకం. బాధతో ఆమె గొంతుక పూడుకుపోయింది. వెంటనే ఆ మాటని మారుస్తూ, "అవ్వా, నీ మనుమడు ఈ మధ్య మళ్లా వస్తాడా" అని ప్రశ్నించింది.

"ఏమో నా తల్లీ ఏం చెప్పేది? కిందటిసారి నాకు జబ్బుచేసినప్పుడు వాడు సెలవు పెట్టి అంతదూరం నుంచి ఆదరబాదరా వస్తే చావకుండా బ్రతికి పోయానని కోపం తెచ్చుకొన్నాడు. 'నీకేం పోయింది అవ్వా! నాలుగు నెలలకోసారి సరిసరి అంటావు. రాకపోతే రాలేదని బాధపడతావని బోల్డుసొమ్ము ఖర్చుపెట్టుకొని నేను వస్తే...' అంటూ చిందులు తొక్కాడే!

"చూడు అమ్మడూ! చావు కిన్ని చావులుంటాయా చెప్పు. అంతా చచ్చిపోయేది ఒక్కసారే కాని పదిసార్లు చావరుకదా! చస్తే ఏముంది చెప్పు. మరో నాలుగేళ్లపాటు బ్రతికుండి... వాడి పెళ్లీ పేరంటం చూడాలని... వాడి కడుపునో కాయకాస్తే... వాడకన్నా నా కెవరున్నారు చెప్పు?.... అయినా వాడి కెందుకో అంత కోపం వచ్చింది.

"సరేలే... ఆ రోజే వాడితో నేను వికరంగా చెప్పేశాను. 'ఒరే కిష్టిగా! అవ్వ ఎప్పుడూ ఇంతే అని కబురు విని రాకుండా ఉండిపోయావు సుమా! ఈసారి జబ్బు చేస్తే నిజంగా చచ్చిపోతాను. ఎంత ఒట్టుపెడితే అంత ఒట్టు' అన్నాను. 'ఇంక ఇలాగ పడదు అవ్వా! నీ చావు కబురు వినే వస్తాను' అన్నాడు.

"వెర్రినాయన అంత మాట అన్నాడా, మళ్లా వెళ్లిపోతూ' అవ్వా! నీకేమీ చెయ్యలేకపోతున్నానే. నన్నెంత కష్టపడి పెంచావు' అంటూ కళ్లనీళ్లు పెట్టుకొన్నాడే.

"వాడిది వెన్నలాటి మనసే కనకం. అయిన వాళ్లంటే ప్రాణం పెడ్తాడు. కాస్త నోటి దురుసు. పెంకితనం కాని నా నాయన ఎంత మంచివాడే... ఆ... అన్నట్లు నీ మాట కూడా అడిగాడే పిల్లా! వాడికి చిన్నప్పటి నుంచీ నువ్వంటే ఎంతో అభిమానం..."

"నా గురించి ఏమని అడిగాడు" కాస్త ముందుకి వంగి ఆత్రుతగా ప్రశ్నించింది కనకం.

"ఏవేవో చాలానే అడిగాడే తల్లీ... అవన్నీ నాకు గుర్తుండి చచ్చాయా! వాడికి నిన్ను ఒకసారి చూడాలని ఎంతగానో వుండే. ఎలానూ వచ్చావు. వాడొచ్చేవరకూ నాలుగు రోజులపాటు ఉండవే కనకం."

అవ్వ చూడకుండా కళ్లు తుడుచుకొంది కనకం.

"ఆ.... నాకు అదేపనా? అతడి అభిమానం కోసం నేనేం పడి చావడం లేదు. నా ఇల్లూ, నా సంసారం నాకుంది. ఈసారి నీ మనుమడు వస్తే, కనకం మొగుడికి

వెయ్యిరూపాయల జీతం అని చెప్పు. అతడికి పట్నంలో రెండు మేడలు, రెండు కార్లు ఉన్నాయని చెప్పు. ఇదిగో ఈ నగలన్నీ చూసేవా? ఇవన్నీ అసలైన మేలిమి బంగారం. రవ్వలు. కెంపులు... తెలిసిందా? మా ఇంటి ముందు దర్వానుకి తనకన్నా ఎక్కువ జీతం ఇస్తామని చెప్పు.... ఇదిగో మరచిపోయావు సుమా! ఇవన్నీ ఒకటి కూడా విడువకుండా చెప్పాలి" కనకం గుక్క తిప్పుకోకుండా చెప్పింది.

"అలాగేనే... నా తల్లీ! ఎందుకు చెప్పనూ? నీ సంగతులన్నీ విని వాడెంత పొంగిపోతాడనుకున్నావు. 'కనకం అదృష్టవంతురాలమ్మా, అది కాలు పెట్టినచోటు కలకల్లాడుతుంది" అంటాడే వాడెప్పుడూ..."

అవ్వ ఇంకా తన మనుమడి మాటలు చెప్పుకుపోతూనే వుంది.

కనకం క్షణకాలం కళ్ళు మూసుకొని ఊపిరి బిగపట్టింది.

"వస్తాను అవ్వా! ఈ రాత్రికే నా ప్రయాణం" అంది కనకం మెల్లగా నిట్టూరుస్తూ.

"మళ్ళా ఎప్పుడొస్తావు?" ఆప్యాయంగా ఆమె వీపు నిమురుతూ అంది అవ్వ.

"ఏమో.... ఏం చెప్పను? ఎప్పుడు వీలుపడుతుందో" అంది కనకం.

"మళ్ళా నిన్ను చూస్తానో... చూడనో... ఈ ముసలిదాన్ని మాత్రం మరచిపోకేం. ఈసారి మా కిష్టయ్య వస్తే... నిజంగా రాడంటావుటే కనకం? ఏదో మాటకి అలా అని ఉంటాడు కాని నే చస్తుంటే రాకుండా ఉంటాడుటే? వాడితో నేనెన్ని సంగతులు చెప్పాలనుకొంటున్నాను.... ఒకవేళ వాడు రాకుండానే చచ్చిపోతే యెలా... ఎలా? పోనీ ఒకపని చేసిపెద్తావు తల్లీ! వాడికో నాలుగు ముక్కలు రాసిపెట్టు. నే చచ్చినా వచ్చి చదువుకొంటాడు" అంది అవ్వ దిగులుగా.

పాపం మనుమడికి ఏం చెప్పాలనుకొంటున్నదో? అతడు రాకుండా ఈమె హరీ అంటే ఆ కొరత మనసులో మిగిలిపోతుందేమో అని జాలిపడింది కనకం.

"అలాగే రాస్తాను. చెప్పు. ఏం రాయమంటావో" అంది.

ఇంటివారి అమ్మాయి కాగితం పెన్సిలు ఇచ్చింది.

అవ్వ ఏదో సొదగా చెప్పుకుపోతున్నది. దానికి మొదలు, తుది, ఒక వరుస, క్రమం అంటూ ఏది లేదు. అర్థం కుదరని ఆ మాటల్ని అటు ఇటు తిప్పి ఒక రూపంలో పెట్టి ఓపిగ్గా వ్రాసింది కనకం. ఇంకా అవ్వ ధోరణి ఆగలేదు.

"అవ్వా ఇంక చాలులే. చాలగానే చెప్పావు" అంది కనకం.

"నా తల్లీ... నా తల్లీ... ఆ ఒక్క మాట" అంటూ బ్రతిమలాడింది అవ్వ. ఆ ఒక్కమాట వ్రాసి కాగితం మడచి అవ్వ చేతిలో పెట్టింది కనకం.

"ఈ రాసింది అవ్వ కోసం కాదు కృష్ణా! నా కోసం. నా దస్తూరి గుర్తించి, ఒక్కసారైనా నువ్వే సర్వం అనుకొన్న కనకాన్ని తలుచుకొంటావేమో అని. నీ మనసులో అయినా నా

ఆలోచనలు నిలుస్తాయేమో అని" కనకం వెనుతిరిగి అవ్వ చేతిలో కాగితం చూస్తూ అనుకొంది.

ఆ క్షణం నుంచే అవ్వ మనసులో మనుమడు రాకుండా చచ్చిపోతానేమో అన్న దిగులు పట్టుకొంది. చీకటి పడుతుంటే ఆ భయం మరి కాస్త బలం పుంజుకొంది. ఉప్మా పిండి ఫలహారం ఆ రోజు అవ్వ గొంతుక దిగలేదు. సగానికి పైగా ఆకులో అలాగే వదలి లేచిపోయింది.

"ఏం అవ్వా! అంతా వదలి లేచిపోయావేం? నీ కెంతో ఇష్టం అని చల్లపోసి ఉప్మా పిండి చేశాను" అంది ఇంటావిడ.

"ఒంట్లో సరిగాలేదా?" అన్నాడు ఇంటాయన.

వారి మాటలు అవ్వకి మరీ భయం కలగజేశాయి. తనకు ఎంతో ఇష్టమైన ఉప్మాపిండి నోటికి రుచీ పచీ లేకుండా పోయింది. 'నిజంగా తనకేదో జబ్బు ముంచుకు రావడం లేదు కదా? కిష్టయ్య రాకుండా చచ్చిపోనుకదా?' భయంతో అవ్వకాళ్ళు గడ గడ లాడాయి. గుండెల్లోంచి వణుకు పుట్టకొచ్చింది. నులక మంచంమీద ముడుచుకు పడుకొని మనసుకి నిబ్బరం తెచ్చుకోవాలనుకొంది.

కిటికీ కన్నాల్లోంచి చలిగాలి రివ్వున కొడ్తున్నది. అవ్వ శరీరం ఆ చలికి గడ్డ కట్టుకుపోతున్నది. దుప్పటి బుర్రమీదుగా ముసుగు పెట్టుకోవాలని పైకి లాగింది. ముందు సంవత్సరం చలికాలంలో కుంపటి కాచుకొంటుంటే దుప్పటి కాలిపోయి అరచేయంత కన్నం పడింది. ఆ కన్నంలోకి అవ్వకాలు దూరిపోయింది. లేచి సర్దుకోవాలనుకొంటే నరాలు పట్టుతప్పి స్వాధీనంలోకి రాకుండాపోయాయి.

"ఈరోజు చలి మరీ ఎక్కువగా వుంది. ఇంకొక దుప్పటి వుంటే బాగుండును" అనుకొంది అవ్వ. ఈసారి కిష్టయ్య వచ్చినపుడు ఇంకొక మంచి దుప్పటి కొనిపెట్టమనాలి. మొదట్లో ఇదీ బాగానే ఉండేది. ఆ రోజు కాలిపోకపోతే.... ఇంటాయన అన్నట్లు ఎంత చలైనా మరీ అంత కుంపటి దగ్గరగా తను కూర్చోక పోవలసింది. నిష్కారణంగా మంచిదుప్పటి కాలిపోయింది. "నాలుగు రూపాయల దుప్పటి. రెండు చలికాలాలు గడువకుండానే కాల్చేసుకొన్నావు" అంటూ విసుక్కొన్నాడు అతడు... నిజమే. వాళ్ళ మాత్రం ఎంతకని పెడ్తారు? పాపం, పిల్లల వాళ్ళు. ఇంకా ఏదో మంచి వాళ్ళు కాబట్టి....

అవ్వకి ఇంటివారిపట్ల మంచి భావం మరికాస్త పెరిగింది. నెల రోజుల క్రిందట అవ్వకి బట్టలు కొనిపెట్టండి. చలికాలం వస్తున్నది. అంటూ కృష్ణుడు పంపిన సొమ్ముతో ఇంటాయన కూతురుకి చీరలు కొనిపెట్టిన సంగతి అవ్వకి తెలియదు.

"... ఈ ముసలి ముండకి ఈపాటి మంచం, పక్కా తిండి, బట్టా చూస్తున్నారు. అదెంత కాదు' అనుకొంది అవ్వ.

రాత్రి మీరుతుంటే చలి మరింత అట్టహాసంతో అవ్వమీదికి దండయాత్ర చేసింది. దవడలు దగ్గర పడుతుంటే, పళ్లు కరుచుకుపోతుంటే అవ్వ బాధగా మూలుగుతూ మగతగా కళ్లు మూసింది.

"నాయనా కిష్టయ్యా! నువ్వొక దుప్పటీ కొనిపెట్టాలిరా, నిన్ను ఇబ్బంది పెట్టకూడదని ఎంత ఓర్చుకొన్నా, ఈ చలి భరించలేకుండా ఉన్నానురా. మహా బాధగా ఉంది. నిజంగా చచ్చిపోతానేమో అని భయంగా వుందిరా" మనుమడు ఎదురుగా ఉన్నట్లే మాట్లాడింది అవ్వ.

"ముసలిముండ చలికి వణికి చస్తున్నది. రేపు ఏదో ఒకటి చూసి కొని పారెయ్యండి" అంది ఇంటివాడి భర్తతో.

"నేనూ ఆ మాటే అనుకుంటున్నానే, ఆ సొమ్ము కాస్తా అలా ఖర్చయిపోయింది. చేతిలో డబ్బు ఆడటం లేదు మరి" అన్నాడు ఇంటాయన.

తెల్లవారుఝాము అయేవరకు అవ్వ మూలుగుతూనే వుంది.ఏదో గొణుగుతూనే వుంది.

ఆ రోజున భళ్లున తెల్లవారినా అవ్వ లేవలేదు.

"సగం రాత్రి గడవకముందే రోజూ లేచి కూర్చునేది. ఈరోజు ఇంకా మొద్దులా పడుకుందే" అంది ఇంటావిడ.

"పాపం పడుకోనీ... రాత్రంతా చలికి చచ్చింది. ఇప్పుడు లేచి అది చెయ్యవలసిన పనులేం మించిపోవు" అన్నాడు ఇంటాయన.

"అహా... నాకు పనులు చెయ్యాలని కాదు. ఏనాడూలేని అలవాటని."

"అమ్మా... అమ్మా! అవ్వ నిద్రపోవడం లేదే, అటకవైపు చూస్తున్నాది" అంది చిట్టి అవ్వ దగ్గరికిపోయి తొంగి చూస్తూ.

"ఆ...ఆ" అంటూ దంపతులిద్దరూ అటు వెళ్లారు.

ఆ రాత్రి చలికి అవ్వ కళ్లు మూతపడలేదు. ఇంక వాటంతట అవి ఎప్పటికీ మూతపడవు.

"మనుమడు రాకుండనే అవ్వ తరలిపోయింది. ఈసారి ముసలవ్వ నిజంగానే చచ్చిపోయింది" ఇరుగూ పొరుగూ ఉదయాన్నే కబురుగా చెప్పుకున్నారు.

మిలటరీలో కృష్ణారావుకి ముసలవ్వ మరణం గురించి ఒక టెలిగ్రాం పంపి. అవ్వ అంత్యక్రియలకి ఏర్పాట్లు చేశాడు ఇంటాయన.

శవాన్ని తరలిస్తుంటే తలకింద పొందికగా మడచిపెట్టిన కాగితం కన్పించింది.

"ఏదో కల కన్నట్లు, నిన్ననే ఆ పిల్లచేత మనుమడికి ఉత్తరం రాయించింది. ఏమైనా డబ్బు, దస్కం ఎక్కడైనా ముసిల్ది దాచి పెట్టిందేమో చూడండి" అంది ఇంటావిడ ఉత్సాహంగా.

ఇంటాయన ఆత్రుతగా కాగితం విప్పి చదవసాగాడు.

"కిష్టయ్యా! నువ్వు రాకుండా చచ్చిపోతానేమో అని భయంగా ఉందిరా. నిన్ను చూడకుంటే నా ప్రాణం తిన్నగా పోదురా తండ్రీ. ఈ ఒక్కసారికే తప్పకుండా రారా, మరి బ్రతకనులేరా.

ఈసారి చావంటే నా కెందుకో భయంగా ఉందిరా. ముందు జన్మలో ఏం చేసుకొన్నానో ఈ జన్మలో మనిషిగా పుట్టించాడు దేవుడు. ఈ బ్రతుకులో చేసిందే ఇంకో బ్రతుక్కి దారంటారు ఈ బ్రతుకులో ఎవరికీ ఏదీ పెట్టుకోలేకపోయానురా చిన్నప్పుడు మీ ముత్తాత కోసం కూడిక చేశాను. ఆ వెనుక మీ తాత కోసం... ఆఖరి దశలో నీ కోసం... ఎంగిలి చేత్తో కాకిని కొట్టకుండా కాలక్షేపం చేశానురా నాయనా. అయినా ఆస్తి అంతా తరిగిపోయింది. నేనూ వెళ్లిపోతున్నాను.

ఇప్పుడు ఏమనుకొంటే ఏం లాభం? ఒంటిలో శక్తి లేదు. చేతిలో పైసా లేదు. నేనే ఇంకొకరి దయా ధర్మాల మీద పడి బ్రతుకుతున్నాను. దానాలు, ధర్మాలు ఏం చేస్తాను చెప్పు?

ఆ మధ్య నువ్వు వచ్చినప్పుడు ఒక కోడిపెట్ట మన గుమ్మం ముందు తిరుగాడేది గుర్తుందా? నువ్వు దానికి సెనగలు కొనివేస్తే ఒక్కొక్క గింజా ఏరుకుతినేది. నువ్వు వెళ్లిపోయాక కూడా అది రోజూ వచ్చి ఇంటిముందు తచ్చాడేది. 'పాపం ఆశతో వచ్చింది. ఏమైనా నాలుగు గింజలు పడేయమ్మా!' అంటే ఇంటావిడ కసురుకొనేది.

ఆవిడ అన్న మాటా నిజమే మరి. పిల్లలకే కడుపునిండా తిండి పెట్టడానికి కటకటగా ఉంటే కోళ్లకి. కుక్కలకీ ఏం వేస్తారు చెప్పు. ఆ కోడి నా ముందు నిల్చి క్వో... క్వో...క్వో... అంటే నా కెంతో జాలివేసేది. నీకు పెట్టడానికి నా దగ్గర ఏమీలేవే అంటే దానికి అర్థమవుతుందా? నాలుగైదు రోజులు వరుసగా వచ్చి అలా అరిచింది.

ఈమధ్య ఇంటివాళ్ళు రెండు రోజులు పెళ్లికి వెళ్లారు. ఇంత ఊరగాయ, రెండు పావుల బియ్యం ఇచ్చి, ఆ రెండు రోజులు నన్ను ఉడకేసుకోమంది ఆ ఇల్లాలు. బియ్యంలో ధాన్యం నిండుగా ఉన్నాయి. ఎండలో కూర్చుని కంటికి దగ్గరగా పెట్టి ఏరుకొన్నాను. ఒక పిడికెడు ధాన్యం వచ్చాయి. మరునాడు ఆ కోడి వస్తే వెయ్యాలని రేకు డబ్బాలో పోసి ఉంచాను. ఎంచేతో ఆ కోడి మళ్లా రానే లేదు. పనిమనిషి నడిగితే 'నాయుడుగారింటికి అల్లుడూ, కూతురూ వచ్చారు కదమ్మా' అంది.

కిష్టయ్యా! దానిని నిజంగా చంపేసారంటావుట్రా? మరీ దారుణంరా. నువ్వు వెళ్లాక పిల్లల్ని కూడా వెంటపెట్టుకొచ్చేది. ఎవరైనా పిల్లల కోడిని తిండి కోసం చంపుకుంటారట్రా? ఏదో జబ్బుపడి ఉంటుంది. మళ్లా లేచి తిరిగాక అదే వస్తుంది. నేను ఉన్నా లేకపోయినా అది మళ్లా వస్తే, ఆ రేకు డబ్బాలోని ధాన్యపు గింజలు దానికి వెయ్యాలిరా. మరచిపోవుకదూ!

ఇందాక ఆ పీచుమిఠాయివాడు కాని డబ్బు పుచ్చుకోకుండా ఇంత మిఠాయి పెట్టాడురా. పాపం ఎంతో మంచివాడిలా ఉన్నాడు. వాడి లాల్చీ అంతా చిరిగిపోయి ఉంది. ఈ చలిలో ఎలా తిరుగుతున్నాడో ఏమో. నా దుప్పటి ఉంది చూసావా. అక్కడ కాలి కన్నంపడినా

చాలామంచి బట్టరా. ఇంకా కొని నిండా నాలుగేళ్లేనా కాలేదు. ఒక్కసారి ఉతుక్కి పోయిందంటే ఆ బురదంతా పోతుందిరా! ఉట్టి ఎర్రమట్టి. రోడ్డు బురద. అంతకన్నా మరేంలేదు. దాన్ని వాడికి ఇచ్చాయి. పాపం పేదవాడు, కప్పుకొంటాడు.

ఈ వీధిలో కాలు విరిగిన నల్లకుక్క ఉంది చూసావూ? రోజూ అరుగు మీద ఎండకి ఆ వారగా పడుకొంటుది...."

"ఏమిటండీ ఈ సోది... ఈ కుక్కలు నక్కలు గురించి కాక ఇంకేం రాయలేదా? దీని ఆస్తి బంగారంగానూ... దాచిపెట్టిందంట... పిడికెడు ధాన్యం... ఒక చింకి దుప్పటి..." అంది ఇంటావిడ విసుగుతో.

"ఇదిగో ఇక్కడ పెరట్లో ఏదో దాచానని అంటున్నది. చదవనీ" అన్నాడు ఇంటాయన ఆఖరుపేరా చూస్తూ.

"కిష్టయ్యా! నీ కోసం నేనేం దాచలేక పోయానురా తండ్రీ! నా కున్నదంతా నువ్వే. ఇంకేం పెట్టను చెప్పు నీకు. ఒక్క వస్తువు మాత్రం దాచి ఉంచానురా. నీ చిన్నప్పుడు పలకసరి గొలుసులో పతకం ఉండేది. దానిలోని పులిగోర్లు ఎర్ర కాగితంలో పొట్లం కట్టి కర్ర పెట్టెలో అడుగున పెట్టాను. భద్రం సుమా! వాటిని జాగ్రత్తగా తీసి దాచు. నీకు కొడుకు పుడితే వాడికి పులిగోరు పతకం చేయించు. ముత్తవ్వ ఇచ్చిందని చెప్పు, మరచిపోకేం!

నువ్వు వాటిని తీసుకోకపోతే నామీద ఒట్టే సుమా, నే చచ్చినంత ఒట్టు. నాకు తెలుసురా కిష్టయ్యా. నీ మనసు వెన్నలాంటిది. నేనంటే నీకెంత అభిమానం! నే చెప్పినట్లు చేస్తావుకదూ..."

కాగితం మడచి వీధివైపు చూశాడు ఇంటాయన.

ఆ శత వృద్ధురాలి కాయం అంతిమ యాత్రకు సిద్ధంగా వుంది. మనుమడు రాకుండానే ముసలవ్వ తరలిపోయింది. ఇదివరకులా కాకుండా ఈసారి నిజంగానే చచ్చిపోయింది.

ఎక్కడో ఉన్న ఆ మనుమడికి అవ్వ అంతిమ కోర్కెలు ఉన్న ఆ కాగితాన్ని పోస్టు చేశాడు ఇంటాయన.

స్నేహితులతో టీ తీసుకొంటూ ఉండగా ఆ ఉత్తరం కృష్ణారావుకి అందింది. ఒకసారి పై నుంచి క్రిందివరకు చదివి. కాగితాన్ని అటు తిప్పి చూసి మౌనంగా జేబులో మడచి పెట్టుకొన్నాడు మనుమడు.

అవ్వ చచ్చిన నక్షత్రం మంచిది కాదని ఆ ఇంటివారు నాలుగు నెలలపాటు ఇల్లు వదలి వెళ్లిపోయారు. వారు తిరిగి వచ్చేసరికి అవ్వ దుప్పటి చెదలు తినేసింది. డబ్బాలో ధాన్యపు గింజలు ముక్కిపోయాయి.

తన ఆఖరి కోరిక తీరిందో లేదో చూసేందుకు అవ్వ ఆ యింట్లో లేదు. ఆ లోకం లోంచి చూసిందో లేదో ఎవరు చెప్పగలరు!